క్లుప్తంగా

ఎస్సార్కేలో నైపుణ్య శిక్షణ ఒప్పందం



రామవరప్పాడు: రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల, డీఏడీబీ ఇండియా లిమిటెడ్‌తో శిక్షణ ఒప్పంద కార్యక్రమం మంగళవారం కళాశాలలో జరిగింది. ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు, డీఏడీబీ ప్రతినిధి శరణ్య ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. శరణ్య మాట్లాడుతూ ప్రత్యేకమైన డీఏడీబీ బ్లెండెడ్ లెర్నింగ్ ఫార్మట్ ద్వారా గ్లోబల్ సౌత్‌లో అభివృద్ధి చెందుతున్న విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులకు జర్మన్ నైపుణ్యం , అభ్యాసన సామర్థ్యాన్ని పెంచడానికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి శ్రీ గౌరి పాల్గొన్నారు.

నేడు కానుకల లెక్కింపు

పెనమలూరు: యనమలకుదురులో శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపు బుధవారం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ ఆలయ హుండీలోని కానులక లెక్కింపు బుధవారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో జరుగుతుందన్నారు.

200 మందికి అన్నప్రసాద వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు దాత గొట్టుముక్కల రవివర్మ సహకారంతో అన్న ప్రసాద వితరణ చేశారు. పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

కంకిపాడు: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వక్తలు కోరారు. ప్రవాస భారతీయులు అడ్డాడ సుష్మ, బాబీ దంపతుల వితరణతో కోలవెన్నులో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. రూ.15 వేల విలువైన వివిధ రకాల మొక్కలను వితరణగా ఇవ్వటంతో ఉపసర్పంచ్ కంచర్ల వెంకటరావు (చిన్ని) ఆధ్వర్యాన వీధుల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.సువర్ణలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ బి.సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా నాణ్యమైన వైద్యం



గొల్లనపల్లిలో మందుల కిట్‌ను అందజేస్తున్న ఎంపీపీ రవి, పోలిమెట్ల జయరాజు, అధికారులు

గన్నవరం రూరల్: కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా పేదలకు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ అనగాని రవి అన్నారు. గొల్లనపల్లి సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీపీ అనగాని రవి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ విద్య, వైద్యాన్ని పేదలకు దగ్గర చేసి వరంగా అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. గ్రామ స్థాయిలోనే ఉన్నత వైద్యం గడప వద్దకే చేర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, ఎంపీడీవో ఇ.సత్యకుమార్, పెద అవుటపల్లి పీహెచ్‌సీ డాక్టర్ కరీమ్, గ్రామపార్టీ కన్వీనర్ గణపవరపు వెంకయ్య, పంచాయతీ కార్యదర్శి మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం సంతకాల సేకరణ చేశారు.

చలివేంద్రపాలెంలో..

కంకిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతను మండలంలోని చలివేంద్రపాలెం పంచాయతీ పరిధిలో మంగళవారం నిర్వహించారు. దీన్ని సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైద్యసేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. డాక్టర్ సుధా ప్రసూజ, డాక్టర్ నిఖిత, డాక్టర్ శశిరామ్, డాక్టర్ వంశీ వైద్య సేవలు అందించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్ కంటి వైద్య పరీక్షలు చేశారు. హెల్త్ సెక్రటరీ జ్యోతిరాణి, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



చలివేంద్రపాలెంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం



సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న శంకర్‌రెడ్డి

ఉంగుటూరు: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి అన్నారు. పెద అవుటపల్లి గ్రామ సచివాలయం వద్ద మంగళవారం పల్లెకుపోదాం, జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలతో సంక్షేమ పథకాలు టీడీపీకి చెందినవారికే అందజేసేవారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా రాజకీయాలకు అతీతంగా సంక్షేమాన్ని అందజేస్తున్నారని చెప్పారు. పెద అవుటపల్లిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.60.89కోట్లు ప్రజలకు లబ్ధిచేకూరిందని ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలోని స్వతంత్ర్య ఎంపీటీసీ అభ్యర్థినున్న విజయకుమారి వైఎస్సార్ సీపీ తీర్థం పుచుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతమ్మ, మండల సచివాలయ కన్వీనర్ వింత ఆదినారాయణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దీప్తి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు నెరవేరుద్దాం



బాపులపాడులో నివాళి అర్పిస్తున్న సర్పంచ్ కమలాబాయ్, వార్డు సభ్యులు

పెనమలూరు: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలు నెరవేర్చాలని చోడవరం సర్పంచి కాకర్ల వెంకటరత్నం అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని బాపులపాడు సర్పంచ్ సరిపల్లి కమలాబాయ్ చెప్పారు. బాపులపాడు పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం సంతకాల సేకరణ బ్యానర్‌పై సంతకాలు చేశారు.

పోలీసుల అదుపులో కోడి కత్తులు కట్టే వ్యక్తి

గన్నవరం: కోడి కత్తులు కట్టే వ్యక్తిని గన్నవరం పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని కేసరపల్లిలో రామాలయం వద్ద నివసిస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం కోడి కత్తులు కడుతుంటాడు. సంక్రాంతి వేళ జూద శిబిరాల నియంత్రణలో భాగంగా డీఎస్పీ జయసూర్య ఆదేశాలతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆతని వద్ద 32 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కనకరావు తెలిపారు. ఎస్ఐలు శ్రీనివాస్, నాగరాజు, నవీన్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నూర్‌బాషా ముస్లింలకు న్యాయం చేయాలి

పెనమలూరు: నూర్‌బాషా ముస్లింలకు న్యాయం చేయాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా అన్నారు. పోరంకిలో మంగళవారం నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం ఉమ్మడి కృష్ణా జిల్లా మహిళా విభాగం సమావేశం రాష్ట్ర కార్యర్శి షేక్ మీరాబి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా షేక్ చిన్నా మాట్లాడుతూ రాష్ట్రంలో నూర్‌బాషా ముస్లింలు 25 లక్షల మంది ఉన్నారన్నారు. చట్టసభల్లో వీరికి నేటికి ప్రవేశం కలగలేదని బాధాకరమన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి ఒక అసెంబ్లీ స్థానాన్ని రాజకీయ పార్టీలు మహిళలకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా అధ్యక్షురాలు షేక్ రంజాన్‌బి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు షేక్‌కరిష్మా, విజయవాడ అధ్యక్షురాలు షేక్ అల్లాబి, సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు సంప్రదాయానికి ప్రతీక సంక్రాంతి



ముస్తాబాదలో కోడిపుంజులను ప్రదర్శిస్తున్న దృశ్యం

గన్నవరం రూరల్: పలుపాఠశాలల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. వీరపనేనిగూడెం శ్రీ గణేష్ యూపీ స్కూల్‌లో విద్యార్థులు తెలుగు సంప్రదాయ వస్త్రధారణతో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఆనంద్ సాగర్ పాల్గొన్నారు. ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో కరస్పాండెంట్ షేక్ ఇమాం, ప్రిన్సిపాల్ జాకీరున్నిసా తదితరులు పాల్గొన్నారు.

రామవరప్పాడు: రామవరప్పాడులోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సువర్ణ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక వీఎస్ సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు భోగిపళ్లు పోయడం, సంక్రాంతి ముగ్గులు మధ్యలో గొబ్బెమ్మలు పెట్టడం, హరిదాసుల వేషధారణలతో సందడి చేశారు. వేడుకలను ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీనియర్ బ్రదర్ జిమ్మీ కురియోకోస్, బ్రదర్ జయబాలన్, కేజీ తరగతుల కోఆర్డినేటర్ ఏకాంబరి, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ‘ఆడుదాం’ మండల స్థాయి పోటీలు

పెనమలూరు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు బుధవారం నుంచి నిర్వహించనున్నామని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు. పెనమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు.

■ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు రెండో దశ ప్రారంభం కానున్నాయి. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఆటల పోటీలు నిర్వహిస్తారు.

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. స్థానిక కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ డబుల్స్, ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో క్రికెట్ పోటీలను జరపనున్నారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆదేశాల మేరకు ఎంపీపీ అనగాని రవి నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడాకారులకు భోజనం, మినరల్ వాటర్, టెంట్‌ల సదుపాయం కల్పించినట్లు ఎంపీడీఓ ఈ. సత్యకుమార్ తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయని వివరించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 60 మందికి ఉద్యోగ అవకాశాలు



ఎంపికైన వారితో ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు, అధ్యాపక బృందం

రామవరప్పాడు: ఎనికేపాడు ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 60 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఎంఎన్‌సీ కంపెనీ ఎసెంచెర్.. విద్యార్థులకు రాత, కమ్యూనికేషన్, హెచ్‌ఆర్ రౌండ్లలో ఇంటర్వ్యూలను చివరి ఏడాది విద్యార్థులకు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ మూడు విభాగాల్లో సాగిన ఇంటర్వ్యూల్లో 60 మంది విద్యార్థులు దేశంలో పలుచోట్ల ఉన్న ఎసెంచెర్ కంపెనీ బ్రాంచిల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు 52 మందికి ఏడాదికి రూ 4.50 లక్షలు, మరో 8 మంది విద్యార్థులకు రూ.6 లక్షల వేతనాన్ని కంపెనీ ఆఫర్ చేసినట్లు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు అధ్యాపక బృందం, తోటి విద్యార్థులు అభినందించారు.

డిజిటల్ లైబ్రరీలుగా మార్పునకు చర్యలు

గ్రంథాలయ పరిషత్ జిల్లా చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ



కంప్యూటర్లను ప్రారంభిస్తున్న జమలపూర్ణమ్మ

గన్నవరం: డిజిటల్ లైబ్రరీలుగా మార్చడానికి చర్యలు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని గ్రంథాలయ పరిషత్ జిల్లా చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. గ్రంథాలయంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్లను ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయంలోని పుస్తకాలను, పాఠకులకు కల్పిస్తున్న సదుపాయాలు పరిశీలించారు. భవిష్యత్తులో అన్ని గ్రంథాలయాల్లో కంప్యూటర్ సేవలు పాఠకులకు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. గ్రంథాలయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు చిమట రామారావు, ఆవుటపల్లి పార్థసారథి, ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి డి. బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని విద్యుత్ విజిలెన్స్ ఎస్ఈ అల్పాన్స్ హెచ్చరించారు. మండలంలోని వీరవల్లి సెక్షన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్ఈ అల్ఫాన్స్, ఈఈ కె.వెంకటేశ్వర్లు నేతృత్వంలో అధికారులు 47 బృందాలుగా ఏర్పడి 2952 గృహ, వాణిజ్య విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో 173 విద్యుత్ సర్వీసులు అదనపు లోడు వినియోగిస్తున్నట్లుగా గుర్తించామని, వీరికి రూ.5.43 లక్షల జరిమానా విధించినట్లు విజిలెన్స్ ఎస్ఈ అల్ఫాన్స్ తెలిపారు. తనిఖీల్లో ఏపీసీపీడీసీఎల్ గుడివాడ డివిజన్ ఈఈ టి.రామకృష్ణ, హనుమాన్‌జంక్షన్ సబ్ డివిజన్ డీఈఈ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరస్పర దాడి కేసులు నమోదు

పెనమలూరు: గంగూరులో కార్ పార్కింగ్ విషయమై తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీయడంతో పోలీసులు ఇరువర్గాల వారిపై మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం గంగూరు అంబేడ్కర్ కాలనీకి చెందిన నందేటి ఉదయ్ కుమార్ హైదరాబాద్‌లో పని చేస్తాడు. అతను తన కారులో గంగూరులోని ఇంటికి వచ్చాడు. ఈ నెల 8వ తేదీన కారును రోడ్డు పక్కన పార్కింగ్ చేశాడు. ఉప్పులేటి శ్యామ్ అనే వ్యక్తి వచ్చి కారు తన ఇంటి పక్కనే ఎందుకు నిలిపావని ఉదయ్‌కుమార్‌తో వాదనకు దిగాడు. దీంతో గొడవ తలెత్తి ఉదయ్‌కుమార్‌పై శ్యామ్, అతని కుమారులు శరత్, శేఖర్ దాడి చేశారు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

కౌంటర్ కేసు నమోదు

ఘర్షణకు సంబంధించి ఉప్పులేటి మల్లీశ్వరి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కౌంటర్ కేసు నమోదు చేశారు. తమ ఆటోను ఇంటి వద్ద పార్కింగ్ చేసే స్థలంలో ఉదయ్‌కుమార్ తన కారును నిలిపి గొడవకు దిగాడని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై ప్రశ్నించినందుకు నందేటి ఉదయ్‌కుమార్, రవి, లంకా గోవిందు, లాం చక్రవర్తి, సుధాకర్.. మల్లీశ్వరి జాకెట్ చించి ఆమెపై ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేశారని తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లి కనిపించడం లేదని ఫిర్యాదు

పెనమలూరు: గోసాలలో తన తల్లి అదృశ్యమైందని కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోసాల చింతల కట్టకు చెందిన షేక్ సుభాన్‌బి కుటుంబం నివసిస్తోంది. ఆమె తండ్రి హుస్సేన్ ఐదేళ్ల క్రితం మరణించడంతో తల్లి షేక్ సుభాన్‌బి కుమార్తె సుభాన్‌బి వద్దే ఉంటూ కూలీ పనులు చేస్తోంది. గత నెల 13న సుభాన్‌బి కూలీ పనులకు వెళ్లి తిరిగి రాలేదు. అప్పుల కారణగానే తల్లి ఇల్లు వదిలి వెళ్లి ఉంటుందని కుమార్తె సుభాన్‌బి పోలీసులకు చేయటంతో కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యం

పెనమలూరు: కానూరులో వివాహిత అదృశ్యమవ్వడంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్‌లో బల్లా రాములమ్మ భర్త, కుటుంబ సభ్యులతో నివసిస్తోంది. వివాహితైన కుమార్తె మౌనిక(23)భర్త ధనుంజయ్‌తో విశాఖపట్నంలో ఉంటోంది.

క్రిస్మస్ పండుగ సందర్భంగా మౌనిక సనత్‌నగర్‌లోని పుట్టింటికి వచ్చింది. ఈ నెల 7న విజయవాడ కనకదుర్గ గుడికి వెళ్లి వస్తానని తల్లికి చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. తర్వాత ఆమె తిరిగి రాలేదు. కుమార్తె ఇంటికి రాలేదని తల్లి రాములమ్మ ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. దీంతో కుమార్తె కనపడటం లేదని పోలీసులకు తల్లి ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ప్రగతి పథంలో ఉయ్యూరు

ఉయ్యూరు: పట్టణం ప్రగతి పథంలో పయనిస్తోంది. విద్య, వైద్య, వ్యాపార, వ్యవసాయ రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధిస్తూ ఆధునికత సంతరించుకుంటోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా పల్లె నుంచి ఉయ్యూరు పట్టణంగా విస్తరించడంతో సేవలన్నీ అందుబాటులోకి వచ్చాయి. కలప వ్యాపారంలో ఉయ్యూరు జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించింది. రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ఖరగ్‌పూర్ వరకూ ఇక్కడికే వస్తున్నారు. చక్కెర కర్మాగారం ఉండటంతో వ్యవసాయ రంగంలోనూ అంతర్జాతీయ గుర్తింపు లభించింది. వైద్య రంగంలోనూ ప్రత్యేకతను సంతరించుకుంది. నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారు. విజయవాడకు చెందిన వైద్యులు సైతం ఉయ్యూరు ఆసుపత్రులకు కన్సల్టెంట్‌గా వచ్చి వైద్య సేవలు అందిస్తుండటం, ఇక్కడి ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు పొందుతున్నాయి. కార్పొరేట్ పాఠశాలలు విస్తరించటంతో ఉయ్యూరు పరిసర గ్రామాల ప్రజలతో పాటుగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల విద్యార్థులు ఉయ్యూరు వచ్చి విద్యనభ్యసించే స్థాయికి చేరింది.

వ్యాపార రంగంలో దినదినాభివృద్ధి



ఉయ్యూరు వ్యాపార రంగంలో దినదినాభివృద్ధి చెందుతోంది. నిర్మాణ రంగానికి అవసరమైన అన్ని వస్తువులు లభిస్తున్నాయి. కలప వ్యాపారంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు లభించింది. బహుళ అంతస్తులు, నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. వ్యాపార రంగం అభివృద్ధి చెందటంతో ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి.

–నూకల వెంకట సాంబశివరావు, వ్యాపారవేత్త

అందుబాటులోకి కార్పొరేట్ వైద్యం



ఉయ్యూరులో వైద్య సేవలు ప్రజలకు చేరువయ్యాయి. అన్ని రకాల వైద్యసేవలకు ఆసుపత్రులు అందుబాటులోకి వస్తున్నాయి. 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తున్నారు.

– డాక్టర్ తోట శ్రీకాంత్ , ఎండీ, జనరల్ మెడిసిన్